నగరం.. చెత్తమయం

- వీధుల్లో పేరుకుపోతున్న చెత్త
- డంపింగ్ యార్డుగా జిల్లా కేంద్రం
- ఎక్కడ చూసినా అపరిశుభ్రతే

సీటీఆర్ఐ: జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరం డంపింగ్ యార్డులా మారింది. ఎక్కడ చూసినా చెత్త దర్శనమిస్తోంది. ఏ డివిజన్‌లో చూసినా ఇదే సమస్య నెలకొంది. రాజమహేంద్రవరం అర్బన్ పరిధిలో 50 డివిజన్లు ఉన్నాయి. సుమారు 1,150 మంది పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నారు. వీరిలో 450 మంది పర్మినెంట్ ఉద్యోగస్తులు కాగా మిగిలిన వారు అవుట్‌సోర్సింగ్‌లో విధానంలో ఉన్నారు. చెత్త తరలించేందుకు కార్పొరేషన్‌కు 19 వాహనాలు ఉన్నాయి. 2022లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం స్వయంభూ ద్వారా 80 చెత్త తరలించే వాహనాలను కార్పొరేషన్‌కు అందజేసింది. చెత్త ద్వారా వచ్చిన పన్నుతో నెలకు రూ.40 లక్షలు వాహనాలకు, డ్రైవర్లకు, ఇంధనానికి కార్పొరేషన్ చెల్లించేది. అయితే కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత చెత్తపై పన్ను రద్దు చేసింది. వాహనాలకు అయ్యే ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందని అప్పట్లో చెప్పింది. కానీ వాహనాలకు, డ్రైవర్లకు డబ్బులు ఇవ్వకపోవడంతో అవన్నీ మూలన పడ్డాయి. దీనితో కార్పొరేషన్‌కు చెందిన 19 వాహనాలతో చెత్తను తరలిస్తున్నారు.

చెత్త డంపింగ్

కార్పొరేషన్ పారిశుధ్య కార్మికులు ఉదయమే వచ్చి చెత్తను తీసుకువెళ్లిపోతున్నారు. ఆ తర్వాత ఇళ్లలో, కార్యాలయాల్లో వచ్చిన చెత్తను ఎక్కడ వేయాలో ప్రజలకు తెలియడం లేదు. దీంతో వీధి మలుపుల వద్ద రోడ్డుపై దాన్ని పారబోస్తున్నారు. తర్వాత రోజు ఉదయం పారిశుధ్య కార్మికులు వచ్చే వరకూ అక్కడి చెత్త అలాగే ఉంటోంది. దీంతో ఎక్కడ చూసినా చెత్త కనిపిస్తోంది. దాన్ని వీధి కుక్కలు చెల్లాచెదురు చేస్తున్నాయి. ఆ చెత్త గాలికి ఎగిరి డ్రైనేజీల్లోకి చేరడంతో నీటి ప్రవాహానికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

కొరవడిన పర్యవేక్షణ

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో వలంటీర్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేసేవారు. దీనితో ప్రజలు చెత్తను రోడ్లపై వేసేవారు కాదు. పైగా ఎక్కడక్కడ చెత్త డస్ట్‌బీన్‌లు ఏర్పాటు చేయడంతో స్థానికులు చెత్తను డస్ట్‌బీన్‌లో వేసేవారు. డస్ట్‌బీన్‌లో నిండినప్పుడు దానిలో చెత్తను పారిశుధ్య కార్మికులు తొలగించేవారు. దీనితో నగరమంతా పరిశుభ్రంగా ఉండేది. పాత కమిషనర్ ప్రతి రోజు ఏదో ఒక డివిజన్ వెళ్లి ఆకస్మికంగా తనిఖీ చేసేవారు. దీనితో సిబ్బంది అప్రమత్తంగా ఉండేవారు. వీధిలో చెత్త లేకుండా చూసేవారు. నేడు పర్యవేక్షణ కొరవడింది.

చెట్ల కొమ్మలు వదిలేశారు

విద్యుత్ శాఖ సిబ్బంది నాలుగు రోజులుగా నగరంలో పలు డివిజన్లలో కొమ్మ కొమ్మలను తొలగిస్తున్నారు. విద్యుత్ తీగలకు తగులుతున్న వీటిని నరికి వేసి, సరఫరాకు ఇబ్బంది లేకుండా చూస్తున్నారు. అయితే నరికేసిన చెట్ల కొమ్మలను అక్కడే రోడ్డుపై వదిలేశారు. సంజీవ నగర్, సుబ్బారావు నగర్, క్వారీ మార్కెట్, లాలాచెరువు తదితర ప్రాంతాల్లో ఈ పరిస్థితి నెలకొంది. ఇప్పటి వరకూ వాటిని తొలగించకపోవడంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు.

అధ్వానంగా రహదారులు

నగరంలో రహదారుల పరిస్థితి మరీ అధ్వానంగా మారింది. రాకపోకలకు ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా వాహన చోదకులు ఆ గోతుల్లో పడి గాయాలపాలవుతున్నారు. వర్షం కురిసినప్పుడు గోతుల్లో నీరు చేయడంతో మరీ ప్రమాదకరంగా మారుతోంది.



దానవాయిపేటలోని గానుగవీధిలో రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త



జాంపేటలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద చెత్త



సంజీవ నగర్‌లో విద్యుత్ శాఖ సిబ్బంది వదిలేసిన చెట్ల కొమ్మలు

కమిషనర్ దృష్టి సారించాలి

నగరంలో పేరుకుపోతున్న చెత్తను తొలగించడానికి కార్పొరేషన్ కమిషనర్ దృష్టి సారించాలి. పారిశుధ్య కార్మికులు ఉదయం పూట మాత్రమే చెత్తను తొలగిస్తున్నారు. ఆ తర్వాత పేరుకుపోయిన దాన్ని మరుసటిరోజు తీస్తున్నారు. దీంతో వీధులన్నీ అపరిశుభ్రంగా కనిపిస్తున్నాయి. చెత్త నుంచి దుర్గంధం వెలువడుతోంది.

– తాడేపల్లి విజయ్‌కుమార్, ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కడియం: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ పోటీల్లో పాల్గొని ఆల్ రౌండ్ ప్రతిభను కనపర్చాలని హెచ్ఎం టి.సత్యనారాయణ అన్నారు. ఏవీఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి ఇళ్ల నవీన్ కుమార్ చెన్నైలో జరిగిన జాతీయ కరాటే అండర్ 15 విభాగంలో పాల్గొని తృతీయ స్థానం సాధించాడు. అలాగే అంకం శ్రావణి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా తరపున అనంతపురంలో జరిగే రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైంది. అలాగే జిల్లా స్థాయి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ పోటీల్లో వంగ హారిక రాజరాజేశ్వరి ద్వితీయ స్థానం సాధించింది. ఈ ముగ్గురు విద్యార్థులను బుధవారం స్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అభినందించారు. వారికి శిక్షణనిచ్చిన పీడీలు ఎం.డేవిడ్, వీరబాబులను, గొల్లపల్లి సత్యనారాయణ, జానకిరామ్‌లను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో బి. సువర్ణవేణి, రఫీయుద్దీన్, సతీష్, శరత్ బాబులు పాల్గొన్నారు.

డ్రైనేజీ నీటితో నర్సరీ మొక్కలకు నష్టం

కడియం: వీరవరం శివాలయం పక్కనే గల తమ భూమిలోకి డ్రైనేజీ నీరు పారడం వల్ల నర్సరీ మొక్కలకు తీవ్ర నష్టం ఏర్పడుతోందని జనసేన నాయకుడు ఆదిమూలం సాయిబాబా తెలిపారు. ఈ మేరకు డిప్యూటీ తహసీల్దార్ జి.మహాలక్ష్మికి పరిస్థితిని వివరించారు. అనంతరం విలేకరులకు ఈ విషయం తెలిపారు. డ్రైనేజీ నీటిని మళ్లించి తమకు నష్టం కలగకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.

క్లుప్తంగా

భూ సమస్యల పరిష్కారానికే గ్రామ సభలు

రాజమహేంద్రవరం రూరల్: భూ సమస్యల పరిష్కారం కోసమే గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ ఏ.రాజాబాబు అన్నారు. పిడింగొయ్యి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన బుధవారం రెవెన్యూ సదస్సు – గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజాబాబు మాట్లాడుతూ భూ విస్తీర్ణంలో సమస్యలున్నా, సర్వే నంబర్లలో ఇబ్బందులున్నా తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి డి.సూర్యనారాయణ, మాజీ సర్పంచ్ బొప్పన నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మల్లికార్జున శర్మ సంతాప సభ

సీటీఆర్ఐ: విజయ శంకర ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలలో బుధవారం అకెళ్ల మల్లికార్జున శర్మ సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.నాగలక్ష్మి, సిబ్బంది, విద్యార్థులు మౌనం పాటించారు. మల్లికార్జున శర్మ సేవలను గుర్తు చేసుకున్నారు. ప్రముఖ వయోలిన్ విద్వాంసులు, సంగీత కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ అయిన అకెళ్ల మల్లికార్జున శర్మ ఈ నెల 20వ తేదీన హైదరాబాద్ మృతి చెందారు.

క్షయ నివారణకు కృషి

కంబాలచెరువు: క్షయ వ్యాధి నివారణకు వైద్య ఆరోగ్య సిబ్బంది కృషి చేయాలని, ఆ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా అదనపు వైద్యఆరోగ్యశాఖ అధికారి, డీఎల్‌టీవో డాక్టర్ ఎస్.వసుంధర అన్నారు. కంబాలచెరువు, ఆనంద్‌నగర్ యూపీహెచ్ సెంటర్లను ఆమె బుధవారం తనిఖీ చేశారు. టీబీ, లెప్రసీ, హెచ్ఐవీ సంబంధించిన ల్యాబ్ రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించారు. టీబీ ప్రెసింటివ్ పరీక్షలు, టీబీ కేసులు తక్కువగా నమోదు కావడంపై ఆరా తీశారు. టీబీ రోగులతో మాట్లాడి వారికి ప్రతి నెలా అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు.

అంతర్జాతీయ మోల్ దినోత్సవం

కంబాలచెరువు: స్థానిక ఆర్ట్స్ కళాశాల రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో చున్నీలాల్ జాజు మున్సిపల్ హైస్కూల్లో బుధవారం అంతర్జాతీయ మోల్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మోల్ భావనపై అవగాహన కల్పించారు. నేడు దేశానికి శాస్త్రీయ పరిశోధనల అవసరం ఎంతో ఉందని, విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదిగి దేశానికి సేవ చేయాలని కెమిస్ట్రీ విభాగం అధ్యాపకులు పిలుపునిచ్చారు. అనంతరం పోటీ పరీక్షలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎం.పద్మజ, డాక్టర్ జి.తేజస్విని, ఎం.శాంతకుమారి, సీహెచ్.రజనీ, జె.శశిశ్రీ, టి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ర్యాంపులో ట్రాక్టర్ల నిలిపివేత

కడియం: ర్యాంపుల నుంచి ఉచితంగా ఇసుకను తీసుకువెళ్లేందుకు మూడు రోజుల పాటు అనుమతించిన ట్రాక్టర్లను బుధవారం నిలిపివేశారు. కడియపులంక–వేమగిరి ఇసుక ర్యాంపులో దళారులు ప్రవేశించి యథేచ్ఛగా ఇసుకను దోపిడీ చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో మంగళవారం కొందరు రెవెన్యూ సిబ్బంది ర్యాంపులోకి వచ్చే ట్రాక్టర్ల నంబర్లు, ఎక్కడి నుంచి వచ్చాయి, ఇసుకను ఎక్కడకు తీసుకువెళుతున్నారు తదితర వివరాలను నమోదు చేసుకున్నారు. బుధవారం ట్రాక్టర్ల ద్వారా ఇసుక రవాణాను పూర్తిగా నిలిపివేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ చర్యలు తీసుకున్నామని రెవెన్యూ సిబ్బంది చెబుతున్నారు.

శిక్షణ పొందిన డ్రైవర్లకు సర్టిఫికెట్ల ప్రదానం



శిక్షణ పొందిన డ్రైవర్లతో ఆర్టీసీ డీపీటీఓ షర్మిల అశోక

రాజమహేంద్రవరం సిటీ: ఏపీఎస్ ఆర్టీసీ రాజమహేంద్రవరం ట్రైనింగ్ స్కూల్లో హెవీ డ్రైవింగ్ శిక్షణ పొందిన డ్రైవర్లు భవిష్యత్తులో ఉన్నత స్థానానికి ఎదగాలని జిల్లా ప్రజా రవాణా అధికారి షర్మిల అశోక కోరారు. ఆర్టీసీ ట్రైనింగ్ స్కూల్లో 12వ బ్యాచ్‌లో 32 రోజుల పాటు హెవీ డ్రైవింగ్ శిక్షణ పూర్తి చేసుకున్న 20 మంది డ్రైవర్లకు బుధవారం సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా డీపీటీఓ మాట్లాడుతూ ఇప్పటివరకు 208 మంది డ్రైవర్లుగా శిక్షణ పొందారన్నారు. గురువారం నుంచి 13వ బ్యాచ్ డ్రైవింగ్ శిక్షణకు అడ్మిషన్లు ప్రారంభమవుతాయన్నారు. ఆసక్తి కలవారు రాజమహేంద్రవరం డిపో మేనేజర్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. 99592 25535 నంబర్‌కు ఫోన్ చేయవచ్చన్నారు. షేక్ షబ్బీం, ట్రైనర్ వీఎస్ఎల్‌రావు పాల్గొన్నారు.

బాలుడి వైద్యానికి సాయం

సీటీఆర్ఐ: కుషల్ అనే రెండున్నరేళ్ల బాబు వైద్య చికిత్సకు సాయమందించేందుకు తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. 46వ డివిజన్‌కు చెందిన దాసింపల్లి శ్రీను, రమ్య దంపతుల కుమారుడైన కుషల్ హైడ్రోసిఫాలసిస్ వ్యాధితో బాధపడుతున్నాడు. దాని నివారణ కోసం బాబుకు మూడు నెలలకు ఒకసారి రూ.18 వేలు విలువైన (బొటెక్స్) ఇంజక్షన్లు పది చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో బాబుకు రెండో డోస్ నిమిత్తం సీటీఆర్ఐకు చెందిన పి.రవితేజ ముందుకు వచ్చారు. ఇంజెక్షన్‌కు అవసరమైన రూ.18 వేలను ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ చేతుల మీదుగా బుధవారం కుషల్ తల్లిదండ్రులకు ఇప్పించారు. మొదటి డోస్‌ను జైన్ సేవా సమితి వారు మూడు నెలల క్రితం అందజేశారు.

నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు

రాజమహేంద్రవరం సిటీ: పారిశుధ్యం విషయంలో నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని కార్పొరేషన్ కమిషనర్ కేతన్ గార్గ్ హెచ్చరించారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, కాలుష్య నియంత్రణ మండలి, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్, ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలంటూ బుధవారం క్షేత్రస్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆయన మాట్లాడుతూ నిబంధనలు అతిక్రమించిన వ్యక్తులు, సంస్థలపై జరిమానాలతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నిషేధిత ప్లాస్టిక్ కవర్ల వినియోగం, విక్రయాలు, బహిరంగ ప్రదేశాలు, కాలువలలో చెత్తను పారవేయడం, చెత్తను కార్మికులకు ఇవ్వకపోవడం, తోపుడు బళ్లు, కమర్షియల్ షాపులలో చెత్త కోసం డస్ట్ బిన్లు ఏర్పాటు చేయకపోవడం, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, మాళ్లు, పెట్రోల్ బంకుల్లో టాయిలెట్లు ఏర్పాటు లేకపోవడం, బహిరంగ మల, మూత్ర విసర్జన చేయడం, గృహ నిర్మాణ వ్యర్థాలు బహిరంగ ప్రదేశాలలో పారవేయడం తదితర అంశాలపై చర్యలు తప్పవని హెచ్చరించారు. నిబంధనలు అమలుకు 36 మంది శానిటేషన్ హెల్త్ ఎన్‌ఫోర్స్ మెంట్ టీమ్‌ను ఏర్పాటు చేశారు. వీరి ద్వారా రూ.1.40 లక్షల అపరాధ రుసుము వసూలు చేసినట్లు తెలిపారు.

7న క్యాన్సర్‌పై అవగాహన సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న జక్కంపూడి విజయలక్ష్మి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని, దానిలో భాగంగా నవంబరు 7న క్యాన్సర్ డే సందర్భంగా కోటగుమ్మం సెంటర్‌లో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ జిల్లా సెక్రటరీ జక్కంపూడి విజయలక్ష్మి తెలిపారు. కోటిపల్లి బస్టాండ్ సమీపంలోని రెడ్‌క్రాస్ సొసైటీ భవనంలో బుధవారం ఆమె అధ్యక్షతన రెడ్‌క్రాస్ సభ్యుల సమావేశం జరిగింది. జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ నవ సమాజ నిర్మాణం కోసం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఎప్పుడూ ముందు వరుసలో ఉంటుందన్నారు. సొసైటీలో సభ్యత్వాలు పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమావేశంలో లంక సత్యనారాయణ, సింగ్ నరేష్ కుమార్ రాజు, రెడ్డి, డాక్టర్ బాబు పాల్గొన్నారు.

వ్యర్థ పూలతో అగరుబత్తీ తయారీకి చర్యలు



అగరుబత్తీ తయారీ యూనిట్‌ను సందర్శించిన డీఆర్‌డీఏ పీడీ మూర్తి, మహిళలు

కడియం: వ్యర్థ పూల నుంచి అగరుబత్తీ తయారు చేసే ప్రణాళికలో భాగంగా బుధవారం తునిలోని అగరుబత్తీ తయారీ యూనిట్‌ను సందర్శించినట్టు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎస్‌వీవీఎస్ మూర్తి తెలిపారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. కడియం మండలానికి చెందిన 40 మంది స్వయం సహాయక మహిళా సభ్యులు, ఎస్‌వీవీఎస్ మూర్తితో కలిసి బుధవారం తుని మండలం తిమ్మాపురంలోని అగరుబత్తీ తయారీ యూనిట్‌ను సందర్శించారు. కడియం పూల మార్కెట్ వద్ద మిగిలిపోయిన పూలను బయటపడవేయడం జరుగుతోందని, వాటి నుంచి ఆదాయం కల్పించే ఉద్దేశంతో కలెక్టర్ సూచనలను అనుసరించి ఈ పర్యటన చేశారు. సాయిదేవి, కరుణ, వరసిద్ధి వినాయక సంఘాల సభ్యులకు తయారీ విధానాన్ని పోలిమాటి సూరిబాబు వివరించారు.

దీపావళి కానుకగా ‘క’ సినిమా విడుదల



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న హీరో కిరణ్ అబ్బవరం, చిత్రంలో నిర్మాత గోపాలకృష్ణారెడ్డి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ‘క’ చిత్రం చాలా వైవిధ్యంగా ఉంటుందని, ఇప్పటికే విడుదలైన టీజర్ ఇంట్రెస్టింగ్‌గా ఉందన్న టాక్ వచ్చిందని హీరో కిరణ్ అబ్బవరం అన్నారు. సుజిత్ అండ్ సందీప్ దర్శకత్వం వహించిన ఈ యాక్షన్ థ్రిల్లర్‌లో కిరణ్ అబ్బవరం, తన్వీరామ్, నయన్ సారిక ప్రధాన పాత్రలు పోషించారు. అనపర్తికి చెందిన నిర్మాత చింతా గోపాలకృష్ణారెడ్డి శ్రీచక్ర ఎంటర్‌టైన్‌మెంట్స్ పేరుతో నిర్మించిన ఈ సినిమా దీపావళి కానుకగా ఈ నెల 31వ తేదీన విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా బుధవారం రాత్రి స్థానిక హోటల్ షెల్టాన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హీరో కిరణ్ అబ్బవరం, నిర్మాత చింతా గోపాలకృష్ణారెడ్డి మాట్లాడారు. హీరో కిరణ్ మాట్లాడుతూ పాన్ ఇండియా లెవెల్లో క మూవీ విడుదల కాబోతోందన్నారు. కుటుంబ సమేతంగా చూడదగిన చిత్రమని తెలిపారు. చింతా గోపాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ కేవలం కథను నమ్ముకుని లాభనష్టాలతో సంబంధం లేకుండా తీసిన ‘క’ సినిమా టీజర్ ఇప్పటికే సోషల్ మీడియాలో హల్చల్ చేస్తోందన్నారు. రేపు విజయవాడలో ట్రైలర్ విడుదల కాబోతోందని తెలిపారు.

డాక్టర్ తేతలి వెంకటేశ్వరరావు కన్నుమూత



కంబాలచెరువు: ఏపీ వైద్య విధాన పరిషత్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వైద్య సేవల విశ్రాంత సమన్వయ అధికారి డాక్టర్ తేతలి వెంకటేశ్వరరావు (79) అనారోగ్యంతో బుధవారం దానవాయిపేటలోని స్వగృహంలో మృతి చెందారు. ఆయన కొంత కాలంగా ఉదర సంబంధిత సమస్యతో బాధపడుతున్నారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. 1945 ఆగస్టు 29న పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో జన్మించిన ఆయన కర్నూలు వైద్య కళాశాలలో ఉన్నత విద్యనభ్యసించారు. ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్‌లో సివిల్ సర్జన్ గా సేవలు ప్రారంభించి తణుకు, కొయ్యలగూడెం, కాకినాడ ఆసుపత్రులలో వైద్యుడిగా పనిచేశారు. కాకినాడ లోని రంగరాయ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ప్రొఫెసర్‌గా, 1993లో సివిల్ సర్జన్‌గా రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేశారు. డాక్టర్ తేతలి మరణ వార్త తెలుసుకుని అనేక మంది వైద్యులు, ప్రముఖులు ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కోటిలింగాల కైలాసభూమిలో గురువారం ఆయన అంత్యక్రియలు జరగనున్నాయి.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

కడియం: ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు సూచించారు. కడియపులంకలో నూతనంగా ఏర్పాటైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. పూర్తిస్థాయిలో సిబ్బందిని ఇక్కడ నియమించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. తగిన వైద్యసేవలు ఇక్కడ లభించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఆయన వెంట జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి ఎస్.రాజకుమారి, సిబ్బంది ఉన్నారు.

60 మందికి ఉద్యోగాలు

కంబాలచెరువు: ఆర్ట్స్ కళాశాలలో బుధవారం జరిగిన దివీస్ ల్యాబ్ క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 60 మంది ఉద్యోగాలు సాధించారని ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే తెలిపారు. ఈ ఉద్యోగాలకు రాష్ట్ర వ్యాప్తంగా 180 మంది హాజరవ్వగా 60 మంది ఎంపిక అయ్యారన్నారు. కళాశాల జేకేసీ కో ఆర్డినేటర్ డాక్టర్ బి.హరినాథ్‌రెడ్డి, ప్లేస్‌మెంట్ ట్రైనర్ ఎం.కిరణ్ కుమార్, దివీస్ లాబ్స్ ప్రతినిధులు పూర్ణ ప్రసాద్, రాజేష్ పాల్గొన్నారు.

28న పీడీఎస్‌యూ 50 వసంతాల వేడుక

కంబాలచెరువు: స్థానిక ఆనం కళాకేంద్రంలో ఈ నెల 25 పీడీఎస్‌యూ 50 వసంతాల జాతీయ సభ నిర్వహిస్తున్నామని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిరణ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యులు టాన్య, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావుతో కలిసి ఆయన జాతీయ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఉస్మానియాలో పురుడు పోసుకున్న పీడీఎస్‌యూ ఎన్నో విద్యా సమస్యలపై పోరాడుతుందన్నారు. పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.భానుప్రసాద్, రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధూ, రాష్ట్ర నాయకులు ఇల్లా చంద్రశేఖర్, అరుణోదయ సాంస్కృతిక సమైక్యరాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.భీమశంకర్ తదితరులు పాల్గొన్నారు.

యాక్టిజన్ క్లబ్ ఆధ్వర్యంలో మాక్ పోలింగ్



మాక్ పోలింగ్ నిర్వహిస్తున్న విద్యార్థులు

కంబాలచెరువు: స్థానిక లాలా చెరువు నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో యాక్టిజన్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. విద్యార్థులే ఎన్నికల అధికారులుగా వ్యవహరించి ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్‌ను ఎన్నుకున్నారు. పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కలిదిండి రమేష్ మాట్లాడుతూ పాఠశాలలో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల విద్యార్థి దశలోనే వారికి ఎన్నికలపై చక్కని అవగాహన కలుగుతుందన్నారు. ప్రధానోపాధ్యాయులు అంకాని మల్లేశ్వరరావు మాట్లాడుతూ దేశ్ అపనాయే అనే సంస్థతో సమగ్ర శిక్ష ఒప్పందం చేసుకుని యాక్టిజన్ క్లబ్ ద్వారా ప్రతినెలా ఒక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. యాక్టిజన్ కమిటీకి మార్గనిర్దేశం చేసిన ఉపాధ్యాయులు లోవబాబు, దుర్గాభవాని, రాజేంద్ర, సూర్యనారాయణరాజు, హనుమ పద్మను ఆయన అభినందించారు.

భారీ అన్నసమారాధన



బాలాజీపేటలో అన్న ప్రసాదం వడ్డిస్తున్న గొందేశి శ్రీనివాసులురెడ్డి

రాజమహేంద్రవరం రూరల్: బాలాజీపేటలోని విజయ కనక దుర్గమ్మ ఆలయం వద్ద శ్రీదేవి శరన్నవరాత్ర మహోత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ముందుగా అర్చకుడు మణికుమార్ అమ్మ వారికి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం జరిగిన అన్నదాన కార్యక్రమానికి సుమారు 8వేల మంది భక్తులు, స్వాములు, భవానీలు తరలివచ్చారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది గొందేశి శ్రీనివాసులురెడ్డి, వాసంశెట్టి సూర్య గణేష్, తలారి శ్రీనివాస్, సూరంపూడి ప్రకాష్, జీపీఆర్ నాయుడు, డాక్టర్ పూజ, నాళం నాయుడు, వడ్డీ రాజా తదితరులు పాల్గొన్నారు.

ప్రభాస్ అభిమానుల సేవా కార్యక్రమాలు



అశోక్ థియేటర్ వద్ద అన్నం వడ్డిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): సినీనటుడు ప్రభాస్ పుట్టిన రోజు వేడుకల సందర్భంగా యంగ్ రెబల్ స్టార్ ఫ్యాన్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ రాజమండ్రి సిటీ అధ్యక్షుడు వై.దేవీ ప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం పలు కార్యక్రమాలు నిర్వమించారు. గాంధీపురం శీలం నూకరాజు కాంప్లెక్స్ సమీపంలోని వెంకటేశ్వరస్వామి, సాయిబాబా తదితర ఆలయాల్లో ప్రత్యేక పూజలు, గోదావరి గట్టున గౌతమీ జీవకారుణ్య సంఘంలోని పిల్లలు, వృద్ధుల మధ్య కేక్ కట్టింగ్, అనంతరం అల్పాహారం పంపిణీ, దానవాయిపేటలోని జక్కంపూడి బ్లడ్ బ్యాంకులో మెగా రక్తదాన కార్యక్రమాలు జరిపారు. అలాగే మహేష్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో అశోక థియేటర్ వద్ద సుమారు 500 మంది ప్రభాస్ అభిమానుల మధ్య కేక్ కట్ చేశారు. పేదలకు అన్నసమారాధన నిర్వహించారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై అన్నం వడ్డించారు.